## ఫొటో స్టోరీ

### మ్యాన్‌హోల్ లీకుతో అవస్థలు



జీవీఎంసీ 25వ వార్డు శాంతిపురంలో స్కీం బిల్డింగ్ సమీపంలో శ్రీ గణసాయి మాన్షన్స్ అపార్టుమెంట్ వద్ద యూజీడీ మ్యాన్‌హోల్ లీకవుతోంది. మురుగు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. పాదచారులు, వాహనచోదకులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నుంచి వచ్చే దుర్వాసనతో నివాసితులు, అటుగా ప్రయాణిస్తున్నవారు ముక్కుమూసుకోవాల్సిన పరిస్థితి నెలకొంది. సంబంధిత అధికారులు స్పందించి యూజీడీ మ్యాన్‌హోల్ లీకును అరికట్టేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. - సీతంపేట

### కళతప్పిన రైతు బజార్



నరసింహనగర్ రైతుబజార్‌లో విక్రయదారులు, కొనుగోలుదారులు లేక వెలవెలబోయింది. కార్తీక మాసం తొలి సోమవారం సందర్భంగా ఆదివారం, సోమవారం బజారు పూజా సామగ్రి, కూరగాయల విక్రయాలతో కళకళలాడింది. మంగళవారం నాగుల చవితి కావడంతో రైతులు చాలా మంది బజారుకు రాకపోవడంతో సగానికి పైగా స్టాల్స్ ఖాళీగా దర్శనమిచ్చాయి. అరకు , పాడేరు ఏజెన్సీ ప్రాంత రైతులు బజార్‌కు వచ్చినా వినియోగదారులు లేకపోవడంతో ఉసూరుమని వెనుదిరిగారు. - సీతంపేట

### ఛీఛీ..'ఛీప్'

ప్రభుత్వ ఛీప్ లిక్కర్ మందుబాబులను రోడ్డున పడేస్తోంది. రూ.99లకే ఛీప్ లిక్కర్ లభిస్తుండడంతో సమయంతో సంబంధం లేకుండా పెగ్‌పైపెగ్ వేస్తూ.. తుళ్లుతూ..తూగుతూ పడిపోతున్నారు. మంగళవారం అక్కయ్యపాలెం లలితానగర్‌లో ఓ వ్యక్తి ఫుల్‌గా మద్యం తాగి ఒక అపార్టుమెంట్ ముందు మత్తులోకి జారుకున్నాడు.

- ఫొటో : సాక్షిఫొటోగ్రాఫర్, విశాఖపట్నం



### పగలే వెన్నెల

విద్యుత్ దీపాల నిర్వహణ అస్తవ్యస్తంగా ఉంది. నియోజకవర్గంలో కొన్ని చోట్ల పగలు కూడా విద్యుత్ దీపాలు వెలుగుతుండగా..మరికొన్ని ప్రాంతాల్లో రాత్రి సమయంలో చీకట్లు అలుముంటున్నాయి. సీతమ్మధార, నక్కవానిపాలెం, పీఅండ్‌టీ కాలనీ, బాలయ్యశాస్త్రి లేఅవుట్ తదితర కాలనీలలో ఇదే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా జోన్-3 పబ్లిక్ వర్క్స్ విభాగం ఇంజినీర్లు స్పందించి విద్యుత్ దీపాలు వెలిగేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. - సీతమ్మధార



పీ అండ్ టీ కాలనీ వద్ద పగలు కూడా వెలుగుతున్న విద్యుత్ దీపం

## క్లుప్తంగా

### యూపీహెచ్‌సీ సందర్శన



మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ పి.జగదీశ్వరరావు ఆశా డే సందర్భంగా విద్యుత్ నగర్ పట్టణ ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఈ ఆశా డే లో న్యూ బోర్న్ కేరింగ్, గ్రోత్ మానటరింగ్ చార్ట్, న్యుమోనియా ఏ విధంగా ముందుగా తెలుసుకోవాలి, స్పేసింగ్ మెథడ్స్ ఏ విధంగా పాటించాలో అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పట్టణ ఆరోగ్య కేంద్ర వైద్యులు, వివిధ విభాగాల ఇన్‌చార్జులు వి.నారాయణరావు, నాగభూషణం, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

### వజ్ర కవచంతో యోగ సిద్ధాంజనేయస్వామి దర్శనం



సర్వాంగవజ్రకవచంతో యోగసిద్ధాంజనేయుడు

మురళీనగర్: సూర్యానగర్-2 జాతీయ రహదారిని ఆనుకుని వెలసిన యోగ సిద్ధాంజనేయస్వామి ఆలయంలో కార్తీక మాసం మొదటి మంగళవారం సందర్భంగా యోగసిద్ధాంజనేయుడికి ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ అర్చకుడు ఆరవిల్లి శ్రీకాంతాచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు అనంతరం తమలపాకులతో నామాచార్చన చేశారు. అనంతరం స్వామిని సర్వాంగ వజ్రకవచంతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. 9గంటలకు సామూహిక సుందరాకాండ పారాయణం, సాయంత్రం 6.30గంటలకు హనుమాన్ చాలీసా, ఆంజనేయ దండకం, తమలపాకులతో అష్టోత్తర నామావళి, అనంతరం భజనానంద హారతి నిర్వహించారు. అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామిని దర్శించుకున్నారు.

### ముగిసిన నిఘా అవగాహనా వారోత్సవాలు



డీఆర్ఎం కార్యాలయం వద్ద నాటిక ప్రదర్శిస్తున్న డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు

తాటిచెట్లపాలెం: వాల్తేర్ డివిజన్ పరిధిలో వారం రోజులుగా జరుగుతున్న నిఘా అవగాహన వారత్సోవాలు మంగళవారంతో ముగిశాయి. ఈ సందర్భంగా డివిజన్ పరిధిలో అవినీతి, లంచగొండితనంపై ప్రయాణికులకు అవగాహన కల్పించారు. వారం రోజులుగా ఈ అంశంపై వ్యాసరచన, వక్తృత్వం, డ్రాయింగ్, పెయింటింగ్, డిబేట్ పోటీలను నిర్వహించారు. సీనియర్ డివిజనల్ పర్సనల్ ఆఫీసర్ రంజన్ మహంతి నాయకత్వంలో డివిజనల్ కల్చరల్ అసోసియేషన్ సభ్యులు డివిజనల్ రైల్వే మేనేజర్ కార్యాలయం వద్ద అవినీతి రహిత సమాజంపై అవగాహన కల్పిస్తూ నాటికను ప్రదర్శించారు. బాల్యదశ నుంచే అవినీతి, లంచం వంటి విషయాలపై పిల్లలకు అవగాహన కల్పించాలని రైల్వే అధికారులు సూచించారు.

### 9న జాతీయ విద్యా దినోత్సవం

మద్దిలపాలెం: భారత రత్న మౌలానా అబుల్ కలాం ఆజాద్ జయంతిని, జాతీయ విద్యా దినంగా ప్రతి ఏడాది నవంబర్ 11న జరుపుకోవడంగా ఆనవాయితీ వస్తోంది. ఈసందర్భాన్ని పురస్కరించుకుని బాల వికాస్ ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 9న ఉదయం 11 గంటలకు డాబాగార్డెన్స్‌లోని ఆదిత్య డిగ్రీ కాలేజీ సెమినార్ హాల్‌లో జాతీయ విద్యా దినోత్సవాన్ని నిర్వహించనున్నామని కో ఆర్డినేటర్ డాక్టర్.జి.బాబ్జీ తెలిపారు. కాలేజీ ప్రిన్సిపాల్ కదిరి కుమార్ బాల, వికాస ఫౌండేషన్ వ్యవస్థాపక కార్యదర్శి ప్రకాశ్ రావు, ట్రైనర్ ఎస్.వి ఆర్.నాయుడు పాల్గొని ఆజాద్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పించనున్నారన్నారు.

# ఘనంగా నాగేంద్రుడికి పూజలు



పోర్టు స్టేడియం వద్ద బారులు తీరిన జనం



పోర్టు స్టేడియం వద్ద పుట్టలో పాలు పోస్తున్న భక్తులు



ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆసుపత్రి ఆవరణలో పాలు పోస్తున్న భక్తులు

సీతంపేట: భారతీయ సంస్కృతి, సంప్రదాయాలకు అద్దం పట్టే నాగుల చవితి వేడుకలు ఘనంగా జరిగాయి. అక్కయ్యపాలెం పోర్టు స్టేడియం ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. అక్కయ్యపాలెం, నరసింహనగర్, రామచంద్రానగర్, దొండపర్తి, శ్రీనివాసనగర్,నందగిరినగర్ ప్రాంతాలకు చెందిన చిన్నా పెద్దా తేడా లేకుండా సంప్రదాయ దుస్తుల్లో కుటుంబ సమేతంగా స్టేడియంకు తరలివచ్చారు. పాముల పుట్టలను భక్తి శ్రద్ధలతో పూజించారు. పసుపు, కుంకుమలతో పూజించి, పాలు పోశారు. కోడిగుడ్లు, చిమిలి, పలు రకాల పండ్లు నైవేద్యం సమర్పించారు. పుట్టమన్ను చెవులకు పెట్టుకొని కాపాడాలని నాగేంద్రుడిని వేడుకున్నారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా విశ్వనాథ స్పోర్ట్స్ క్లబ్ బారీకేడ్లు ఏర్పాటు చేసి, తోపులాట లేకుండా స్టేడియంలోకి పంపించారు. బాణసంచా అనుమతించ లేదు.

**కంటి ఆస్పత్రి ఆవరణలో...**

సీతంపేట, రామాటాకీస్,శ్రీనగర్, తులసిపేట, రేసపువానిపాలెం ప్రాంతవాసులు నాగుల చవితి పర్వదినాన్ని ప్రభుత్వ ప్రాంతీయ కంటి ఆస్పత్రి ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. కుటుంబ సమేతంగా పుట్టల వద్దకు వెళ్లి పూజలు చేశారు. నాగన్నకు పాలు, గుడ్లు, చిమిలి, నాగుల తువ్వాళ్లు సమర్పించారు. సంప్రదాయ వస్త్రధారణలో భక్తులు కనువిందు చేశారు. సీతంపేటలోని ప్రభుత్వ కంటి ఆసుపత్రి, ట్రాన్స్‌పోర్టు కార్యాలయ ఆవరణ, రీజనల్ ట్రైనింగ్ సెంటర్ కేంద్రాల ఆవరణలు భక్తులతో కిటకిటలాడాయి. బాణసంచాతో హోరెత్తించారు.

**కంచరపాలెంలో...**

కంచరపాలెం: జీవీఎంసీ 46,47,48,54,55 వార్డులు కంచరపాలెం కొండవాలు, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ప్రాంతాల్లో మంగళవారం నాగుల చవితి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ప్రజలు పుట్టల వద్దకు వెళ్లి నాగేంద్రుడుకి ప్రత్యేక పూజలు జరిపారు. ప్రకృతి పుట్టల్లోనే భక్తులు పసుపు, కుంకుమలతో పాటు గుడ్లు, పాలు, వేసి తమ మొక్కులు తీర్చుకున్నారు. కప్పరాడ, పెదకొత్తూరు, సంజీవయ్యకాలనీ, కైలాసపురం, శాంతినగర్, శ్రీనివాసనగర్, ఇందిరానగర్, తాటిచెట్లపాలెం కప్పరాడ, బర్మాక్యాంప్, కస్తూరినగర్, 104 ఏరియా బాపూజీనగర్ తదితర ప్రాంతాల్లో భక్తులు నాగేంద్రునికి పూజలు నిర్వహించారు. బాణసంచా టపాసులతో ఘనంగా భక్తులు నాగులచవితి జరుపుకున్నారు.

సీతమ్మధార: నాగుల చవితి వేడుకలను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో జరుపుకున్నారు. మంగళవారం ఉదయం నుంచే ఆయా ప్రాంతాల్లో భక్తుల రాకపోకలతో సందడిగా కనిపించింది. పలు ప్రాంతాల్లో గల పుట్టల వద్ద మహిళలు ముగ్గులు వేసి నాగేంద్రుడికి పాలు పోసి పూజలు చేశారు. పిల్లలు బాణసంచా కాల్చారు. పుట్టల వద్ద అధిక సంఖ్యలో భక్తులు కుటుంబ సమేతంగా తరలివచ్చి పూజలు చేశారు. సీతమ్మధారలోని గణేష్‌నగర్, రాధాకృష్ణ లేఅవుట్, బాలయ్యశాస్త్రి లేఅవుట్, తదితర ప్రాంతాలలో గల పుట్టలు భక్తులతో కిటకిటలాడాయి. నక్కవానిపాలెంలోని శ్రీ ఉమానీలకంఠేశ్వరస్వామి ఆలయంలో నాగదేవత ఆలయంలో భక్తులు పోటెత్తారు. ఇక్కడి నాగదేవత విగ్రహం వద్ద అధికసంఖ్యలో భక్తులు పూజలు చేశారు.

**మురళీనగర్ ప్రాంతంలో..**

మురళీనగర్: మురళీనగర్ పరిసర ప్రాంతాల్లో నాగుల చవితి ఉత్సవాన్ని ప్రజలు సంప్రదాయ సిద్ధంగా జరుపుకున్నారు. ఉదయం నుంచి ఇళ్లల్లో పూజలు నిర్వహించి నాగుల చవితికి అవసరమైన సామగ్రిని సిద్ధం చేసుకున్నారు. పాలు, గుడ్లు, తాటి టెంకల గుంజు, పూలు, పండ్లు, ఇత పూజా సామగ్రితో కుటుంబ సభ్యులతో కలిసి పుట్టల వద్ద నాగదేవతకు పూజలు చేశారు. మురళీనగర్ పరిసరాల్లోని తోటలు, కొండ వాలు ప్రాంతాలో, జాతీయ రహదారిని ఆనుకుని ఉన్న ప్రభుత్వ పాలిటెక్నిక్, ప్రభుత్వ కెమికల్ ఇంజినీరింగు ఇన్‌స్టిట్యూట్, సేవా రహదారులను ఆనుకుని గ్రీన్‌బెల్ట్ ప్రాంతాల్లోని ఎక్కడ చూసిన భక్తుల సందడి కనిపించింది.

**షిర్డీసాయిబాబా ధ్యానమందిర ప్రాంగణంలో..**

తాటిచెట్లపాలెం: రైల్వేన్యూకాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీసాయిబాబా ధ్యానమందిర ప్రాంగణంలో గల నాగసుబ్రహ్మణ్యేశ్వరస్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. నాగుల చవితి సందర్భంగా భక్తులు స్వహస్తాలతో పంచామృతాభిషేకాలు, విశేష అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు నూకల శేషగిరిరావు , త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



నాగేంద్రుడికి పూజలు చేస్తున్న భక్తులు



నాగసుబ్రహ్మణ్యస్వామికి పూజలు నిర్వహిస్తున్న భక్తులు



కంచరపాలెం కొండవాలులో నాగేంద్రునికి పూజలు చేస్తున్న భక్తులు



పట్టాభిరెడ్డితోట ప్రాంతంలో పుట్ట వద్ద పూజలు చేస్తున్న స్థానికులు

### 'టోల్' బాదుడుతో భక్తుల ఆగ్రహం



పుట్టలో పాలు పోయడానికి వచ్చిన భక్తులను ఆపేస్తున్న టోల్ నిర్వాహకులు

మద్రిపాలెం: నాగుల చవితి పర్వదినం పురస్కరించుకుని మంగళవారం మాధవధార ప్రాంతమంతా భక్తులతో కిటకిటలాడింది. మంగళవారం ఉదయం నుంచి పెద్ద సంఖ్యలో భక్తులు మాధవధార ఆలయానికి వెళ్ళేమార్గంలో నాగేంద్రుడికి పుట్టలో పాలు పోసి పూజలు నిర్వహించారు. కుటుంబ సమేతంగా అందరూ పుట్టలో పాలు పోసి, నాగన్నకు పూజలు నిర్వహించారు.

ఈ ప్రాంతానికి వాహనాలపై వచ్చిన భక్తులను లోపలికి వెళ్లనీయకుండా టోల్ గేట్ వద్ద నిర్వాహకులు ఇబ్బందులకు గురిచేశారు. వాహనాలపై వచ్చేవారిని అడ్డగించి ద్విచక్ర వాహనానికి రూ.10, కారుకు రూ.20 వసూలు చేయడంతో భక్తులు అసహనం వ్యక్తం చేశారు. అయితే ఇటువంటి పర్వదినాల్లో స్థానిక ప్రజలను ఇబ్బందులు పెట్టడం సరికాదని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతేకాక దేవస్థానం అధికారులు టోల్ రుసుము ఎలా వసూలు చేస్తారని ప్రశ్నించారు.

### డీఎంహెచ్‌వోతో బేయర్ జైడస్ ఫార్మా ప్రతినిధుల భేటీ



డీఎంహెచ్‌వో జగదీశ్వరరావుతో మాట్లాడుతున్న బేయర్ జైడస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు

మహారాణిపేట: రేసవానిపాలెంలో ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి(డీఎంహెచ్‌వో) కార్యాలయాన్ని ఢిల్లీకి చెందిన బేయర్ జైడస్ ఫార్మా కంపెనీ ప్రతినిధులు మనోజ్, డాక్టర్ దాలి మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావుతో పలు విషయాలు చర్చించారు. ప్రిజర్వ్ ది యుటరస్ కాంపెయిన్‌ను డాఎంహెచ్‌వో వివరించారు. అనంతరం శిక్షణ కోసం జిల్లాకు వచ్చిన పలువురు ఆరోగ్య సిబ్బందితో కూడా డీఎంహెచ్‌వో చర్చించారు.

### ఎలా వెళ్లేది?



24వార్డు టీపీటీ కాలనీలో సాయిబాబా ఆలయ రహదారిపై భవన నిర్మాణ సామగ్రి

సీతమ్మధార : భవన నిర్మాణ యజమానులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తున్నారు. రహదారిని ఆక్రమించి నిర్మాణ సామాగ్రి డంప్ చేస్తున్నారు. దీంతో ద్విచక్ర వాహనాలు, కార్ల రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయి. టీపీటీ కాలనీలోని సాయిబాబా ఆలయ సమీపంలో రోడ్డును ఆక్రమించి ఇసుక, పిక్క అడ్డంగా వేయడంతో ట్రాఫిక్ ఇబ్బందులు ఎదురవుతున్నాయి. జీవీఎంసీ పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు చూసీచూడనట్టు వ్యవహరిస్తుండడంతో భవన నిర్మాణ యజమానులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు.

### మరింత విస్తృతంగా ఉచిత వైద్యసేవలు

ఎంవీపీకాలనీ: శ్రీ సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో మరింత బలోపేతంగా ఉచిత వైద్యసేవలు అందించనున్నట్లు ఆ సంస్థల జిల్లా అధ్యక్షుడు పీఆర్ఎస్ఎన్ నాయుడు వెల్లడించారు. ఇందుకు అనుగుణంగా మరో ముందడుగు పడినట్లు మంగళవారం ప్రకటనలో తెలిపారు. ఎంవీపీ కాలనీలోని ప్రేమసదన్‌లో 50 మంది సీనియర్ వైద్యులతో ప్రత్యేక ఇంటరాక్టివ్ సెషన్‌ను మంగళవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భాగంగా కమ్యూనిటీ హెల్త్‌కేర్ సహకారాన్ని పెంపొందించాలని నిర్ణయించారు. సత్యసాయి సేవా సంస్థల ఆధ్వర్యంలో ప్రత్యేక ఉచిత వైద్యశిబిరాలు, స్పెషలిస్ట్ డాక్టర్ల సేవలు వినియోగం, ఔషధాలు పంపిణీ, రాష్ట్ర వ్యాప్తంగా సేవలు విస్తృతం చేయాలని తీర్మానించారు. అనంతరం శ్రీ సత్యసాయి మొబైల్ వైద్య బృందం అధ్యక్షుడు డాక్టర్ జీవీఎస్ రావు ఈ అంశంపై సమగ్ర నివేదికను అందజేశారు. ఈ కార్యక్రమంలో పలువురు ప్రముఖ డాక్టర్లు, సేవా సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

### యథేచ్ఛగా ఆక్రమణ

సీతమ్మధార : నియోజకవర్గంలో ఫుట్‌పాత్‌లు ఆక్రమణలకు గురవుతున్నాయి. తోపుడు బండ్లు ఏర్పాటు చేసి మరీ వ్యాపారాలు చేయడం గమనార్హం. పలురకాల సామగ్రితో ఫుట్‌పాత్‌లు నిండిపోవడంతో పాదచారులు కాలు పెట్టడానికి సైతం వీలులేకుండా ఉండడంతో స్థానికులు ఆందోళన చెందుతున్నారు. సీతమ్మధార, బాలయ్యశాస్త్రి లేఅవుట్, టీపీటీ కాలనీ, పీఅండ్‌టీ కాలనీ, నక్కవానిపాలెం, సత్యం జంక్షన్, తదితర ప్రాంతాల్లో గల ఫుట్‌పాత్‌ల మీద హోటల్ వ్యాపారాలు చేసేవారితో నిండిపోయాయి. పలు ప్రాంతాలలో సర్వీసు రోడ్ల మీద కూడా బడ్డీలు, ఇతర వ్యాపారాల కారణంగా చుట్టుపక్కల ప్రాంతాల ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. ఈ నేపథ్యంలో ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని సెప్టెంబర్ 20న జీవీఎంసీ కమిషనర్ , జోన్-3 కమిషనర్, ఏసీపీలకు ఎమ్మెల్యే విష్ణు కుమార్‌రాజు లేఖ రాశారు. అయినా ఇంతవరకూ స్పందన లేదు. ఇప్పటికైనా టౌన్‌ప్లానింగ్ అధికారులు, ఫోర్త్ టౌన్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి ఫుట్‌పాత్‌లపై ఆక్రమణలు తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.



బాలయ్యశాస్త్రి లేఅవుట్ ఫుట్‌పాత్‌పై తోపుడుబండితో వ్యాపారాలు

### 7న చట్ పూజా వేడుకలు

డాబాగార్డెన్స్: సాగరతీరాన గురువారం నుంచి చట్ పూజా వేడుకలు నిర్వహించనున్నట్టు పూజా సమితి తెలిపింది. సమితి సభ్యులు మాట్లాడుతూ ప్రధానంగా బీహార్, ఉత్తరప్రదేశ్ రాష్ట్రాల్లో పెద్ద ఎత్తున జరుపుకునే ఛట్ పూజను ఆ రోజు సాయంత్రం 4 గంటలకు పాండురంగాపురం టెంపుల్‌కు ఎదురుగా గల బీచ్‌లో నిర్వహించనున్నట్టు చెప్పారు.



### రోడ్డెక్కిన మురుగుతో అవస్థలు

సీతంపేట : ప్రధాన రహదారుల్లో తరచూ మురుగు నీరు రోడ్డెక్కుతున్నా జీవీఎంసీ అధికారులు శాశ్వత పరిష్కారం చూపడం లేదని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ 25వ వార్డు దుర్గాగణపతి ఆలయం నుంచి రాధాకృష్ణ ఆలయానికి వెళ్లే మార్గంలో బైక్ రెంటల్స్ వద్ద మురుగు నీరు రోడ్డెక్కి ప్రవహిస్తోంది. ఇక్కడ తరచూ ఇదే సమస్య తలెత్తుతోందని, సిబ్బంది వచ్చి అడ్డుపడిన చెత్త తీసి వెళ్లిపోతుండడంతో మరలా అదే సమస్య ఎదురవుతోందని నివాసితులు అంటున్నారు. డ్రెయిన్‌లో చెత్త, వ్యర్థాలు తొలగించే వీలు లేకుండా ఇళ్ల ముందు స్లాబులు నిర్మించడం వల్ల సమస్య తలెత్తుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. మురుగు నీరు సాఫీగా ప్రవహించేలా, రోడ్డు పైకి మురుగు రాకుండా శాశ్వత పరిష్కారం చూపాలని స్థానికులు కోరుతున్నారు. సంబంధిత ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కారానికి చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.



సీతంపేటలో రాధాకృష్ణ ఆలయం వద్ద రోడ్డుపై మురుగు నీరు